క్లుప్తంగా

నేడు మెగా ఉచిత వైద్యశిబిరం

గరుగుబిల్లి: మండలంలోని రావుపల్లి గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఆదివారం ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ బి.మహేష్ ఓ ప్రకటనలో శనివారం తెలిపారు. హైదరాబాద్ కేర్ ఆస్పత్రి హృద్రోగ వైద్య నిపుణులు డాక్టర్ గుల్ల సూర్య ప్రకాష్ ఆధ్వర్యంలో జరిగే ఈ శిబిరంలో ఆయన, మరికొంతమంది వైద్యులు రోగులకు తనిఖీలు నిర్వహించనున్నారన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎమ్మార్సీకి చేరిన పుస్తకాలు



మండల కేంద్రంలోని ఎమ్మార్సీలో భద్రపరిచిన పుస్తకాలు

సీతంపేట: స్థానిక ఎమ్మార్సీకి పాఠ్య, నోటు పుస్తకాలు చేరుకున్నట్లు ఎంఈవో సూర్యచంద్రరావు శనివారం తెలిపారు. జూన్ 12వ తేదీన పాఠశాలల పునఃప్రారంభం నాటికే విద్యార్థులకు పుస్తకాలు అందించేలా సన్నాహాలు చేస్తున్నామన్నారు. మొత్తం 170 పాఠశాలలకు గాను 56,252 నోటు పుస్తకాలు, 41,663 పాఠ్యపుస్తకాలు వచ్చినట్లు పేర్కొన్నారు.

శిష్టకరణ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా కోటేశ్వరరావు

పాలకొండ: శిష్టకరణ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా రుద్ర కోటేశ్వరరావు ఎన్నికయ్యారు. శిష్టకరణాల ఐక్యతకు మరింత కృషి చేస్తానని ఆయన తెలిపారు. ఆయన ఎన్నిక పట్ల ఆ సంఘ సభ్యులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఎస్‌డబ్ల్యూపీసీలను వినియోగంలోకి తీసుకురావాలి



కొండాపురం ఎస్‌డబ్ల్యూపీసీని పరిశీలిస్తున్న డీఎల్‌పీవో రామ్‌ప్రసాద్

పాలకొండ: ఎస్‌డబ్ల్యూపీసీ(చెత్త సంపద తయారీ కేంద్రాలు)లను వినియోగంలోకి తీసుకురావాలని డీఎల్‌పీవో రామ్‌ప్రసాద్ సూచించారు. మండలంలోని కొండాపురం చెత్త సంపద కేంద్రాన్ని ఆయన శనివారం సందర్శించారు. కేంద్రానికి తరలిస్తున్న చెత్తాచెదారం ద్వారా సేంద్రియ ఎరువు తయారు చేసి, దానిని సబ్సిడీపై రైతులకు అందించడం ద్వారా పంచాయతీకి అదనపు ఆదాయం సమకూర్చవచ్చన్నారు.

అన్నదానం



అన్నప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు

గరుగుబిల్లి: మండలంలోని తోటపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ సందర్శనకు వచ్చిన భక్తులకు శనివారం అన్నదానం చేశారు. ఉదయం నుంచే దైవ దర్శనానికి భక్తులు పోటెత్తగా, సుప్రభాతసేవ, మంగళాశాసనం, శాత్తుమురై, తీర్థఘోష్టి తదితర పూజా కార్యక్రమాల అనంతరం భక్తులకు సర్వదర్శనం కల్పించారు. ఈ క్రమంలో భక్తులు స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ఆవరణలో ఇచ్చిన అన్నప్రసాదం స్వీకరించారు.

పుస్తకం పఠనం అలవాటు చేసుకోవాలి



విద్యార్థులకు సూచనలిస్తున్న విశ్రాంత ఉపాధ్యాయుడు వెంకటరమణ

పాలకొండ రూరల్: విద్యార్థులంతా చిన్నప్పటి నుంచే పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలని విశ్రాంత ఉపాధ్యాయుడు మండల వెంకటరమణ, లైబ్రేరియన్ బి.గణేష్‌బాబు సూచించారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాలకు శనివారం హాజరైన ఆయన.. అక్కడి విద్యార్థులకు పలు సూచనలు చేశారు. పుస్తకాలు చదవడం ద్వారా కొత్త విషయాలు తెలుస్తాయని తద్వారా జ్ఞానం మెరుగుపడుతుందన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

సీతానగరం: ఇళ్ల స్థలాలకు అర్హులైన వారు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ ప్రసన్నకుమార్ శనివారం తెలిపారు. స్థలాలు లేని వారు, ఇళ్లు లేని వారు ఈ సేవ, సచివాలయాల్లో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అర్హులైన వారి నుంచి దరఖాస్తులను ప్రభుత్వం ఆహ్వానించేందుకు మార్గదర్శకాలు విడుదల చేసిందని, దీన్ని పేదలు వినియోగించుకోవాలని సూచించారు.

నవధాన్యాల సాగుతో భూసారం



గరుగుబిల్లి: నవధాన్యాలు కిట్లు అందజేస్తున్న ప్రకృతి వ్యవసాయం రీజనల్ టెక్నికల్ అధికారి హేమసుందర్

గరుగుబిల్లి: నవధాన్యాల సాగుతో భూసారం పెరుగుతుందని ప్రకృతి వ్యవసాయం రీజనల్ టెక్నికల్ అధికారి జి.హేమసుందర్ అన్నారు. మండలంలోని సంతోషపురం రైతు సేవా కేంద్రంలో రైతులకు నవధాన్యాల కిట్లు శనివారం పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నేల సారవంతానికి 20 నుంచి 30 రకాల విత్తనాలను నేలలో వేసుకుని 45 రోజుల పాటు సాగు చేసిన తర్వాత ఆ మొక్కలను అదే నేలలో కలియదున్నితే పంటకు అవసరమైన సూక్ష్మపోషకాలు సమృద్ధిగా లభిస్తాయన్నారు. జిల్లాలోని 15 మండలాల్లో రైతులు నవధాన్యాల సాగుకు సిద్ధంగా ఉన్నారన్నారు. వరి పంట ప్రధాన గట్లుపై చిక్కుడు, బెండ, బీర, బంతి తదితర పంటలను సాగు చేయడం ద్వారా అదనపు ఆదాయం లభిస్తుందన్నారు. స్టేట్ రిసోర్స్‌పర్సన్ పి.దేవుళ్లు మాట్లాడుతూ ప్రకృతి సేద్యంలో జిల్లా ప్రథమ స్థానంలో ఉండేలా ప్రతి కార్యకర్త పనిచేయాలని తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి ఆర్.విజయభారతి, ఎన్ఎఫ్ఏ జి.అన్నపూర్ణ, మండల ఇన్‌చార్జ్ వి.పోలినాయుడు తదితరులు పాల్గొన్నారు.

సీతంపేట: మండలంలోని కుశిమి గ్రామ రైతు సేవా కేంద్రంలో వ్యవసాయాధికారి మన్మధరావు ఆధ్వర్యంలో రైతులకు నవధాన్యాల కిట్లు శనివారం పంపిణీ చేశారు. అనంతరం నవధాన్యాల సాగు ద్వారా కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం యాంకర్ బి.నరేష్ తదితరులు పాల్గొన్నారు.

జియ్యమ్మవలస: మండలంలోని అల్లువాడు, బిత్రపాడు గ్రామాల రైతు సేవా కేంద్రాల్లో అల్లువాడ గ్రామ సర్పంచ్ బొంగు పరిశినాయుడు చేతులమీదుగా రైతులకు నవధాన్యాల కిట్లు శనివారం అందజేశారు. అనంతరం నవధాన్యాలు పొలాల్లో వేసుకుని సాగు చేయడం ద్వారా కలిగే ప్రయోజనాలను ప్రకృతి వ్యవసాయం అధికారులు వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ బొంగు సురేష్, ఎన్ఎఫ్ఏ జి.అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.



జియ్యమ్మవలస: నవధాన్యాల ప్యాకింగ్, ప్రయోజనాలపై అవగాహన కల్పిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది



సీతంపేట: పంపిణీకి సిద్ధం చేసిన నవధాన్యాల కిట్లు

వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి చేస్తాం



మాజీ డిప్యూటీ సీఎం పుష్పశ్రీవాణి, పార్టీ జిల్లా అధ్యక్షుడు పరీక్షిత్‌రాజులకు పుష్పగుచ్ఛాలు అందజేసి కృతజ్ఞతలు తెలుపుతున్న పార్టీ మండల కమిటీ సభ్యులు

జియ్యమ్మవలసరూరల్: కొత్తగా నియమితులైన వైఎస్సార్ సీపీ మండల కమిటీ సభ్యులంతా మాజీ డిప్యూటీ సీఎం పాముల పుష్పశ్రీవాణి, పార్టీ జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజులను మండలంలోని చినమేరంగిలో శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. తమకు పార్టీ పదవులు వచ్చిన సందర్భాన్ని పురస్కరించుకుని, కృతజ్ఞతగా పుష్పగుచ్ఛాలతో సత్కరించారు. తమపై ఎంతో నమ్మకం ఉంచి పార్టీ పదవులు ఇచ్చిన పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి, తమకు పదవులు రావడంలో తోడ్పడిన మీకు తమ కృతజ్ఞతలని తెలిపారు. పార్టీ బలోపేతానికి అహర్నిశలు కృషి చేస్తామని, తమపై పార్టీ ఉంచిన నమ్మకాన్ని ఇంధనంగా చేసుకుని మరింత రెట్టింపు ఉత్సాహంతో పనిచేస్తామన్నారు.

ఇళ్లు కోసం దరఖాస్తు చేసుకోండి



మాట్లాడుతున్న తహసీల్దారు చిన్నారావు

జియ్యమ్మవలస: ఇళ్లు, ఇళ్లస్థలాలు కావాలనుకునే నిరుపేదలంతా సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దారు చిన్నారావు కోరారు. ఇదే విషయమై ఆయన మండల కేంద్రంలోని తన కార్యాలయంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో ఎక్కడా ఇళ్లు గానీ, ఇళ్లస్థలం గానీ లేని పేదలు దరఖాస్తు చేసుకుంటే ప్రభుత్వం ఇల్లు మంజూరు చేస్తుందన్నారు. తెల్ల రేషన్‌కార్డు ఉండి, 3 ఎకరాల కన్నా ఎక్కువ పల్లం, మెట్టు, పల్లం కలిసి 10 ఎకరాలలోపు ఉండాలని, సంవత్సర ఆదాయం రూ.12 వేల కన్నా తక్కువ ఉండాలని, ఆదాయ పన్ను చెల్లింపుదారు అయి ఉండకూడదన్నారు. 4 చక్రాల వాహనం కూడా ఉండరాదన్నారు. ఆటో, ట్యాక్సీ, ట్రాక్టరు ఫరవాలేదన్నారు. ఇదివరకు ప్రభుత్వం ఇచ్చిన ఇళ్లు ఉండకూడదన్నారు.

అభినందన

పాలకొండ రూరల్: నగరపంచాయతీ అధ్యక్షురాలిగా ఎన్నికైన ఆకుల మల్లీశ్వరిని రెల్లి ఉపకులాల రాష్ట్ర అధ్యక్షుడు గండి విజయ్‌కుమార్ అభినందించారు. స్థానిక పట్టణంలోని ఆమె స్వగృహానికి శనివారం వెళ్లి, ఆమె ఎన్నిక పట్ల హర్షం వ్యక్తం చేశారు. నగరపంచాయతీ అభివృద్ధికి కృషి చేయాలని, అలాగే బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి పాటుపడాలని కోరారు.

దోమల నివారణ మందు పిచికారీ



సీతంపేట: ఇంట్లో దోమల నివారణ మందు స్ప్రే చేస్తున్న సిబ్బంది

సీతంపేట: మండలంలోని జి.గుమ్మడ, గడిగుజ్జి, ఎం.ఎం.గూడ, జయపురం తదితర గ్రామాల్లో దోమల నివారణ మందు శనివారం పిచికారీ చేశారు. దోమల కారణంగా మలేరియా, డెంగీ, చికెన్‌గున్యా వంటి విషజ్వరాలు ప్రబలకుండా జాగ్రత్త వహిస్తున్నట్లు సబ్‌యూనిట్ ఆఫీసర్ జె.మోహనరావు తెలిపారు.



భామిని: వీధుల్లో దోమల నివారణ మందు పిచికారీ చేస్తున్న దృశ్యం

భామిని: మండలంలోని నులకజోడు గ్రామంలో బత్తిలి వైద్యాధికారి కె.దామోదరరావు ఆధ్వర్యంలో దోమల నివారణ మందు శనివారం పిచికారీ చేపట్టారు. దోమలు పెరగకుండా చూసుకోవాలని, అనవసరంగా నీటి నిల్వలు ఉంచొద్దని వైద్యాధికారి సూచించారు. జ్వరపీడితులు ఎక్కడైనా ఉంటే వారిని గుర్తించి, ఆస్పత్రికి వెంటనే తరలించి చికిత్స అందజేయాలన్నారు.

కిశోరి వికాసంపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ పీవో సిమ్మాలమ్మ

పాలకొండ రూరల్: మండలంలోని ఎం.సింగుపురం అంగన్‌వాడీ కేంద్రంలో కిశోరి బాలికల వికాసంపై శనివారం అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ పీవో బి.సిమ్మాలమ్మ, సూపర్‌వైజర్ దశరత్నం మాట్లాడుతూ 11 ఏళ్ల నుంచి 18 ఏళ్ల వయసు బాలికలంతా వ్యక్తిగత ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలన్నారు. ప్రతిరోజూ తీసుకునే ఆహారంలో పౌష్టికాహారం ఉండేలా చూసుకోవాలన్నారు. రక్తహీనత బారినపడకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

12న గ్రామదేవతల పండగ

గుమ్మలక్ష్మీపురం: ఎల్విన్‌పేట, గుమ్మలక్ష్మీపురం గ్రామదేవతల పండగ ఈ నెల 12వ తేదీన ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆయా గ్రామాల పెద్దలు శనివారం తెలిపారు. గుమ్మలక్ష్మీపురంలో వేపారమ్మ గ్రామదేవత ఉత్సవాలు, ఎల్విన్‌పేటలో నీలమ్మ-నూకాలమ్మ గ్రామదేవత సంబరాలు జరగనుండగా, ఆయా గ్రామాల్లో ఏర్పాట్లు చురుగ్గా కొనసాగుతున్నాయి. ఇప్పటికే చల్లదనం, ఉజ్జిడి పూజా కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఈ నెల 4న ఉజ్జిడి బండి ఊరేగింపు, 6న ముహూర్తపురాట, 9న పోతురాజు గుడి పునఃప్రారంభోత్సవం, 12న అమ్మవారి పాదాలు తేవడం, 18న అంజలి రథం తిరువీధి, ఉయ్యాల కంబాల కార్యక్రమం, 20న మల్లెలు తొక్కడం, ఊరు కట్టడం, 21న అనుపోత్సవం జరగనున్నాయి. ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు గ్రామంలో అమ్మవారి ఘటాల తిరువీధి చేయనున్నారు.



వేపారమ్మ గ్రామదేవత

ఆధునిక వ్యవసాయంపై దృష్టి సారించాలి

- నైరా వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎం.భరతలక్ష్మి



అగ్రికల్చర్ విద్యార్థుల వ్యవసాయ ప్రదర్శనలను తిలకిస్తున్న నైరా వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ భరతలక్ష్మి

గరుగుబిల్లి: రైతులంతా ఆధునిక వ్యవసాయంపై దృష్టి సారించాలని నైరా వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎం.భరతలక్ష్మి సూచించారు. మండలంలోని గిజబ గ్రామంలో రస్తాకుంటుబాయి కేవీకే(కృషి విజ్ఞాన కేంద్రం) ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన రైతు సదస్సుకు ఆమె హాజరయ్యారు. తొలుత నైరా కళాశాల అగ్రికల్చర్ విద్యార్థులు ఏర్పాటు చేసిన వ్యవసాయ ప్రదర్శనను ఆమె సందర్శించారు. అనంతరం రైతులను ఉద్దేశించి, మాట్లాడారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా వ్యవసాయ విధానాలు కూడా మార్చాలన్నారు. తెగుళ్లు తట్టుకుని, ఆరోగ్యవంతమైన పంట, అధిక దిగుబడులు ఇచ్చే సాగు పద్ధతులు అవలంబించాలన్నారు. ముఖ్యంగా సంప్రదాయ పంటలు కాకుండా ఎగుమతులకు అనుకూలంగా ఉండే పంటలను పండిస్తే అధిక లాభాలు పొందవచ్చన్నారు. సాగుకు అయ్యే పెట్టుబడి తగ్గించుకునేందుకు వ్యవసాయంలో యాంత్రీకరణ వినియోగించాలన్నారు. సాగులో యంత్రాల వినియోగం ద్వారా కూలీల కొరత తీరడంతో పాటు సమయం ఆదా అవుతుందన్నారు. కేవీకే వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ ఎస్.ధ్రువ మాట్లాడుతూ ప్రతి రైతు వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు, నిపుణుల విలువైన సలహాలు, సూచనలు పాటిస్తే నష్టపోయే పరిస్థితి ఉండదన్నారు. అనంతరం అరటి, వరి సాగులో చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. సీతంపేట అగ్రికల్చర్ రీసెర్చ్ సైంటిస్ట్ డాక్టర్ లక్ష్మీనారాయణ.. అరటి, వరి పంటల్లో చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలను వివరించారు. కార్యక్రమంలో నైరా వ్యవసాయ కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ వై.రాజశేఖర్, కేవీకే శాస్త్రవేత్తలు డాక్టర్ ఎం.అనంతవిహారి, డాక్టర్ ఎస్.స్రవంతి, డాక్టర్ అమృతవీణ, ఎంపీటీసీ ఎం.సింహాచలం నాయుడు, జట్టు ట్రస్టు మేనేజర్ ప్రహరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీల ఆత్మగౌరవ సభను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న ట్రైబల్ రైట్స్ ఫోరం జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): గుమ్మలక్ష్మీపురం మండల కేంద్రలో గిరిజన జేఏసీ ఆధ్వర్యంలో మే 7వ తేదీన జరిగే ఆదివాసీ ఆత్మగౌరవ సభ, ర్యాలీని విజయవంతం చేయాలని ట్రైబల్ రైట్స్ ఫోరం జిల్లా అధ్యక్షుడు ఇంటికుప్పల రామకృష్ణ కోరారు. ఇదే విషయమై మండలంలోని మొండెంఖల్లులో శనివారం విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన డీఎస్సీ నోటిఫికేషన్‌లో గిరిజనులకు తీవ్ర అన్యాయం చేసిందన్నారు. జీవో నంబర్ 3 పునరుద్ధరించకుండా నోటిఫికేషన్ జారీ చేయడం దారుణమన్నారు. సదరు జీవోను మళ్లీ తీసుకువచ్చి గిరిజన ప్రాంతాల్లోని శతశాతం ఉపాధ్యాయ ఖాళీలను గిరిజన ఉపాధ్యాయ అభ్యర్థులతో నింపాలన్నారు. అలాగే 1/70 చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని, ఏపీ ట్రైబల్ అడ్వైజరీ కమిటీ ఏర్పాటు చేయాలని, నకిలీ ధ్రువపత్రాలతో ఉద్యోగాలు పొందిన వారిపై సమగ్ర దర్యాప్తు చేసి, వారి ధ్రువపత్రాలను రద్దు చేయాలని కోరారు. ఆయా డిమాండ్లతో చేపట్టే సభ, ర్యాలీకి గిరిజనులంతా హాజరుకావాలని ఆయన కోరారు.

దాడి అమానుషం

పాలకొండ: వంగర జెడ్పీటీసీ ప్రతినిధి కరణం సుదర్శన్‌పై టీడీపీ నాయకులు దాడికి పాల్పడడం అమానుషమని వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పెన్షనర్స్ అండ్ ఉద్యోగుల విభాగం జిల్లా అధ్యక్షుడు ఎద్దు లిల్లీ పుష్పనాథం ఖండించారు. ఇదే విషయమై ఆయన స్థానిక విలేకరులతో శనివారం మాట్లాడారు. సుదర్శన్‌పై హత్యాయత్నానికి పాల్పడిన వారిని వెంటనే అరెస్ట్ చేసి శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ తరహా దాడులు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విపరీతంగా పెరిగిపోయాయని మండిపడ్డారు. హత్యా రాజకీయాలను ప్రోత్సహించడం సరికాదని, ఇప్పటికైనా ప్రజలకు మంచి చేసే పనులు చేయాలని హితవుపలికారు. లేకపోతే సమయం చూసి ప్రజలే తగిన బుద్ధి చెబుతారన్నారు.

అప్రమత్తంగా వ్యవహరించాలి



సిబ్బందికి సూచనలిస్తున్న ఫైర్ ఎస్ఐ సర్వేశ్వరరావు

పాలకొండ రూరల్: అగ్నిప్రమాదాలు సంభవించేటప్పుడు ఆందోళన చెందకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని పాలకొండ అగ్నిమాపక అధికారి జామి సర్వేశ్వరరావు సూచించారు. స్థానిక అగ్నిమాపక కార్యాలయం వద్ద సిబ్బందికి శనివారం పలు సూచనలు చేశారు. అగ్నిప్రమాదాల పట్ల ప్రజలను చైతన్యం చేయాలని, వారు ప్రమాదానికి గురికాకుండా ఉండడంతో పాటు ప్రమాదంలో చిక్కుకున్న వారిని రక్షించేలా అవగాహన కల్పించాలన్నారు. ఐఎస్ఐ మార్క్ కలిగిన ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్ ఉపకరణాలు వాడేలా సూచనలివ్వాలన్నారు.



గురండిలో కోత కోసిన చేనును యంత్ర సాయంతో నూర్పిడి చేస్తున్న దృశ్యం

ముమ్మరంగా రబీ వరి కోతలు

భామిని: మండలంలో రబీ వరి కోతలు ముమ్మరంగా జరుగుతున్నాయి. నేరడి, గురండి, బొమ్మిక, కాట్రగడ, బిల్లుమడ ప్రాంతాల్లో ఇటీవల గాలివానకు నేలమట్టమైన చేతికి అందివచ్చిన పంటను యంత్రాలతో కోతలు చేసి, నూర్పిడి చేస్తున్నారు.

దారిద్ర్యం



పాలకొండ మండలం, రాజుపేట నుంచి కోటిపల్లి వెళ్లే రోడ్డు చాలా అధ్వానంగా తయారైంది. దారి పొడవునా గుంతలు, పైకితేలిని రాళ్లు కనిపిస్తున్నాయి. ఆ దారిలో ప్రయాణించేందుకు ప్రజలు భయపడుతున్నారు. అధికారంలోకి రాగానే రోడ్లు బాగు చేసి చూపిస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం.. ఇప్పుడు ఏం చేస్తోందని ప్రశ్నిస్తున్నారు. ఇలాగేనా రోడ్లు ఉంచేదని నిలదీస్తున్నారు. కొత్త రోడ్లు వేయకపోయినా ఉన్న పాత రోడ్లు అయినా బాగు చేయాలని వారు కోరుతున్నారు. -పాలకొండ రూరల్

కమ్యూనిస్టు వైతాళికుడు శ్రీరామ్మూర్తి



మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు సుబ్బరావమ్మ

పార్వతీపురం: ప్రజా ఉద్యమాల పట్ల నిరంతరం శ్రమిస్తూనే కార్మిక రైతాంగ వర్గానికి వెన్నుదన్నుగా నిలుస్తూ విశాల ఐక్య ఉద్యమాలకు ఊపిరి పోసిన కమ్యూనిస్టు వైతాళికుడు రెడ్డి శ్రీరామ్మూర్తి అని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు కె.సుబ్బరావమ్మ అన్నారు. పట్టణంలోని ఎన్‌జీవో హోం భవనంలో శనివారం నిర్వహించిన రెడ్డి శ్రీరామ్మూర్తి నాలుగవ వర్ధంతి సభలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి సంతాపం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిరుద్యోగ సమస్యలపై నికరంగా పోరాడేందుకు డీవైఎఫ్ఐ సంఘ నాయకుడిగా సమాజానికి పరిచయం అయ్యాడన్నారు. మతోన్మాద శక్తుల నుంచి విముక్తి పొందేందుకు కార్మికవర్గం ద్వారా సోషలిజమే ప్రత్యామ్నాయమని నమ్మిన వ్యక్తి అన్నారు. కార్యక్రమంలో ఎన్‌జీవో సంఘ అధ్యక్షుడు జివి.కిషోర్, సీపీఎం నాయకులు ఎం.కృష్ణమూర్తి, రెడ్డి శ్రీదేవి, ఎం.తిరుపతిరావు, జివి.రమణ, కె.సాంబమూర్తి, బివి.రమణ, బి.దాసు, వై.మన్మధరావు తదితరులు పాల్గొన్నారు.

మలేరియా ప్రబలకుండా చర్యలు తీసుకోండి

- డీఎంహెచ్‌వో ఎస్.భాస్కరరావు



వైద్య సిబ్బందికి సూచనలిస్తున్న డీఎంహెచ్‌వో భాస్కరరావు

గుమ్మలక్ష్మీపురం: గిరిజన ప్రాంతాల్లో మలేరియా ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్‌వో డాక్టర్ ఎస్.భాస్కరరావు సూచించారు. మండలంలోని తాడికొండ పీహెచ్‌సీ(ప్రాథమిక ఆరోగ్య కేంద్రం) పరిధిలోని గుమ్మ గ్రామంలో శనివారం నిర్వహించిన దోమల నివారణ మందు పిచికారీ పనులను ఆయన పరిశీలించారు. అనంతరం పీహెచ్‌సీ వైద్య సిబ్బందితో సమావేశమై మాట్లాడారు. క్షేత్ర స్థాయిలో ఫీవర్ సర్వే పక్కాగా నిర్వహించాలని, జ్వరపీడితులను గుర్తించి వెంటనే ఆస్పత్రికి తరలించాలని సిబ్బందికి సూచించారు. దోమల నివారణ మందు పిచి కారీ సమయంలో ముఖానికి మాస్క్, చేతులకు గ్లౌజ్‌లు విధిగా ధరించాలన్నారు. ఆయన వెంట జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్మోహన్‌రావు, పీహెచ్‌సీ వైద్యాధికారులు డా. ఎం.బుద్దేశ్వరరావు, డాక్ట పి.అభిలాష్ పాల్గొన్నారు.